క్లుప్తంగా

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐలు తరంగిణి, మీరజ్ హెచ్చరించారు. రామిరెడ్డితోటలోని మహిళలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను వీడి జీవితాలను బాగు చేసుకునేలా కష్టపడి పనిచేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దిశ యాప్ డౌన్‌లోడు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లయన్ వెంకటసుబ్బయ్యకు అవార్డుల పంట



పాత గుంటూరు: 2021- 22, 23 సంవత్సరాలకు లయన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందించిన లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం సీనియర్ నాయకులు వి.వెంకట సుబ్బయ్య ప్రతిష్టాత్మక జిల్లా గవర్నర్ అప్రిసియేషన్ అవార్డు, గవర్నర్ ఎక్సలెన్సీ అవార్డులను కైవసం చేసుకున్నారు. మంగళవారం అమరావతి రోడ్డులోని బి.వి.ఆర్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్స్ జిల్లా 316 హెచ్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.మన్మథరావు, ఎండార్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి. సుభాష్ బాబు, ఏరియా లీడర్ డాక్టర్ వి.ఎస్.వి.డి.శివప్రసాద్ నుంచి వెంకటసుబ్బయ్య అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ గవర్నర్ కె.విజయ చంద్, పి.గోపీచంద్ పాల్గొన్నారు.

నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మంగళవారం నగరంలో పర్యటించింది. ఆరుగురు సభ్యుల బృందం పట్టాభిపురం, శ్యామలానగర్, బసవతారకరామానగర్, కొరిటెపాడు, పలకలూరు తదితర ప్రాంతాల్లో డోర్ టూ డోర్ తిరిగి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. తడి, పొడి చెత్త విధానం, స్వచ్ఛ సర్వేక్షణ్ గురించి తెలుసా, సెప్టిక్ ట్యాంక్ నిండితే మిషన్ ద్వారా తీయిస్తున్నారా, మాన్యువల్‌గా తీస్తున్నారా? లాంటి ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ రిపోర్టును బట్టి గుంటూరు నగరానికి ర్యాంకును నిర్దేశించనున్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్రపై వ్యాసరచన పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు దేశాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు మంగళవార నిర్వహించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నా మట్టి -నా దేశం నినాదంతో భాగంగా పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు స్మరించుకునేందుకు అవకాశంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ జీవీ సుధీర్ కుమార్, జయ శైలజ, శ్రావణి, పి. అప్పారావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

ఐద్వా నేతల డిమాండ్

తాడేపల్లిరూరల్: మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని నిపుణులతో కమిషన్ ఏర్పాటు చేయాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. హింసపై మహిళల పోరుయాత్రలో భాగంగా మంగళవారం తాడేపల్లి ముగ్గురోడ్డుకు చేరుకున్న సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై హింస రోజురోజుకూ పెరుగుతోందని, నిరోధించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై ఢిల్లీలో జరిగిన సంఘటన మరవక ముందే మణిపూర్‌లో కుకి తెగకు చెందిన గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించడం సిగ్గుచేటన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల అధ్యయనానికి నిపుణులతో కమిటీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి, జిల్లా అధ్యక్షులు కె.పద్మ, పట్టణ అధ్యక్షురాలు డి. విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి అరుణ ఉన్నారు.

కార్పొరేషన్ రిజర్వు స్థలాల అభివృద్ధికి చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఓపెన్, రిజర్వ్ స్థలాలను స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నామని, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించడానికి పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశించారు. మంగళవారం గుజ్జనగుండ్ల, బాపయ్య నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, గోరంట్లలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన రిజర్వ్, ఓపెన్ స్థలాలను పరిశీలించి అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నగర పాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా స్థానికులకు ఆహ్లాదాన్ని అందించే పార్కులు, ఆట స్థలాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర పాలక సంస్థ అభివృద్ధి చేసిన పార్కుల నిర్వహణకు స్థానికులను భాగస్వామ్యం చేస్తామన్నారు. పార్కుల్లో ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం పెంపు ఉండాలని, గుర్తించిన పార్కుల్లో బాస్కెట్ బాల్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలాల గుర్తింపు, ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌కి సూచించారు. పర్యటనలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందర రామిరెడ్డి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈ రఫిక్, శివకుమార్ పాల్గొన్నారు.

విద్యా దీవెన చెక్కు అందజేత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విదేశీ విద్యా దీవెన పథకం కింద మంజూరైన రూ. 22.44 లక్షల సాయాన్ని విద్యార్థికి ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మంగళవారం అందజేశారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వసంతరాయపురానికి చెందిన నందవరపు నాగుల్ మీరా 2018లో కజికిస్థాన్‌లోని ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్(ఐఎస్ఎం) చదివేందుకు వెళ్లాడు. విదేశీ విద్యా దీవెన పథకం కింద వెళ్లిన నేపథ్యంలో కరోనా పరిస్థితుల్లో మొదటి విడతగా జమ చేసిన రూ.5 లక్షలు జమ కాలేదు. ఈక్రమంలో హౌస్ మార్టిగేజ్‌లోను ద్వారా రూ.7 లక్షలు చెల్లించి చదువు కొనసాగించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముస్తఫా విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం వై.ఎస్.జగన్ రూ.22,44,537 చెల్లించేలా చెక్కును విద్యార్థికి అందజేశారు. దీంతో చదువు మధ్యలో ఆగిపోకుండా ఆర్థిక సాయం చేసిన సీఎం వై.ఎస్.జగన్, ఎమ్మెల్యే ముస్తఫాలకు నాగుల్‌మీరా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళ నేత నూరి ఫాతిమా పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల ఆటోలపై కేసు

సాక్షి ఎఫెక్ట్



ఆటో తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు

పట్నంబజారు: పసిమొగ్గల ప్రాణాలతో చెలగాటం శీర్షికతో మంగళవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆర్టీఓ అధికారులు పాఠశాలలకు వెళ్లే ఆటోల తనిఖీ చేపట్టారు. గుంటూరులో లాడ్జిసెంటర్, నాజ్‌సెంటర్, చుట్టుగుంట, గుజ్జనగుండ్ల, వికాస్ నగర్, తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను పట్టుకున్నారు. 18 ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తి స్థాయిలో నిబంధనలు పాటిస్తూ ఆటో డ్రైవర్లు నడపాలని సూచించారు. ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే జరిమానా విధించడంతో పాటు, ఆటోలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

మోదుకూరి జాన్సన్‌కు నివాళి



జాన్సన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: మోదుకూరి జాన్సన్ రచనలు ఆదర్శనీయమని మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ పేర్కొన్నారు. ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మేడ్(మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్) రాష్ట్ర కార్యాలయంలో మోదుకూరి జాన్సన్ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత మోదుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1936 ఆగస్టు 8వ తేదీ తెనాలి సమీపంలోని కొలకలూరులో జన్మించిన జాన్సన్ మొదటి నుంచి నటనపై ఆసక్తితో అనేక నాటకాలలో నాటికాలలో వివిధ పాత్రలలో రాణించిన అసమాన ప్రతిభా సంపన్నుడు జాన్సన్ అని కొనియాడారు.

ఎంతో సజీవమైన అజరామరామైన మాటలు, పాటలు, రచనలు చేసిన వ్యక్తిగా చెప్పారు. దేశోద్ధారకుడులో స్వాగతం దొర సుస్వాగతం కరుణామయుడులో కదిలింది కరుణ రథం పాడి పంటలు చిత్రంలో మన జన్మభూమి బంగారు భూమి లాంటి చిరస్మరణీయ గేయాలు రచించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో డెమోక్రాటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు కొల్లిపర ఆనందరావు, ఈహెచ్ఎస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రావెల నల్లయ్య, ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ అసోషియేషన్ నాయకులు కందుకూరి మరియదాసు, కంచర్ల శ్యామ్, పేరకలపూడి రమేష్, చాట్ల గురవయ్య , వీరయ్యచౌదరి, పేరుపోగు కమలయ్య, జనమాల శ్యామ్, షేక్ మస్తాన్ వలి, రెడ్డిబోయిన డేవిడ్, గర్నెపూడి ఆదెయ్య పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్య భారత నిర్మాణంలో పిల్లల ఎదుగుదలలో పౌష్టికాహారం, ఆటలు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని, చదువుపై ఆసక్తి కలిగేలా చేస్తాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ టెక్నో, మెడీ పాఠశాలలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, నులిపురుగుల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు, జంక్ ఫుడ్స్ వంటి చెడు ఆహారపు అలవాట్లు ద్వారా పొట్టలో నులిపురుగులు ఏర్పడి రక్తహీనత కలుగుతుందని చెప్పారు. దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని, ఇంటిలో వండిన ఆహారం ఒక్కటే పూర్తి ఆరోగ్యాన్ని ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎన్.చక్రనాగ్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యా బోధన, పిల్లల ఆరోగ్యం , వారి సమగ్ర ఎదుగుదలకు ప్రజ్ఞ విద్యాసంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నదని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు బహూకరించారు. డాక్టర్ కీర్తి, శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక కృష్ణాయపాలెం రహదారి విస్తరణ పనులను నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం నుంచి చేపట్టారు. ఉండవల్లి నుంచి పెనుమాక మీదుగా కృష్ణాయపాలెం వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా పెనుమాక శివారు నుంచి హిందూ బరియల్ గ్రౌండ్ మీదుగా రావిచెట్టు సెంటర్ వరకు మరో రహదారిని నిర్మించేందుకు గతంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్పొరేషన్ నుంచి రూ. కోటి కేటాయించి సుమారు 800 మీటర్ల పొడవున బీటీ రోడ్ నిర్మించనున్నారు. మార్గం మధ్యలో కొన్నిచోట్ల రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో వాటిని తొలగించి పనులు చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. కృష్ణాయపాలెం మీదుగా అమరావతి వెళ్లేవారు ఈ మార్గంలో వెళ్లవచ్చని దానివల్ల పెనుమాక ప్రాంతంలోని వైఎస్సార్‌సెంటర్, బొడ్డురాయి సెంటర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
PIAGGIO NUOVO XLD X BS IV
2019 MODEL AP39 TG 6404
Cell : 70329 87268
6-9-17, 1st Floor, Ratna Deepika Plaza, Arandalpeta 9/1, GUNTUR.

NOTICE
IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE::GUNTUR
I.P. No. 81 / 2022
Between:-
Kolla Chencha Rao ...Petitioner
and
Kolla Subba Rao & Others ...Respondents
To:
R-4: A.Nagi Reddy, S/o.Not Known, R/o. Flat No:302, Vinayak Nagar, Guntur.
R-7: D.SubbaRatnam, S/o.Not Known, C/o.Sri Kali Ashramam, Pedakakani, Namburu, Guntur Dist.
R-11: G.Gaya-Ibi, D/o.Srinivasa Rao, R/o. Donka Road, Guntur.
R-12: S.Bhimeswara Rao, S/o.Not Known, R/o. R.T.C Colony, Guntur.
[illegible] తేది.08-09-2023 [illegible]
(శ్రీ కొల్లువారి ఉత్తర్వుల ప్రకారం)
[illegible] తేది: 08-08-2023
K. DURGA BHAVANI
Advocate for Petitioner, Srinivasa Rao Thota, Guntur.

13న జేవీవీ ఆధ్వర్యంలో పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్, సాయికుమార్, రమేష్

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న పాఠశాల స్థాయి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో పోటీలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్ పోటీలను 5,6,7 తరగతుల విద్యార్థులకు జూనియర్, 8,9,10 తరగతుల విద్యార్థులకు సీనియర్ విభాగంలో పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ప్రతినిధులు కె. సాయికుమార్, దేవసూర్య, పవన్, మణి, భార్గవ్, ఆదిత్య, వినయ్, జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, టీఆర్ రమేష్, బి.శంకర్‌సింగ్, బి.ప్రతాప్‌సింగ్, డి.ప్రవీణ్, హనుమంతరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసు స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

పట్నంబజారు: వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ షేక్ ఆరీఫ్ హఫీజ్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత పరిసరాలు పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న ప్రమాద కేసుల వివరాలు, ఇతర రికార్డులపై ఆరా తీశారు. ట్రాఫిక్ పోలీసులు వెస్ట్ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర అంశాలను ఎస్పీకి వివరించారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలసుందరరావు, సీఐ అక్కేశ్వరరావు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ అక్కేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు

పట్నంబజారు: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ పి.అక్కేశ్వరరావు చెప్పారు. మంగళవారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల వివరించే పోస్టర్లు ఆవిష్కరించారు. సీఐ అక్కేశ్వరరావు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చు అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో బస్‌పాస్‌లు అందజేత



మంగళగిరి: యర్రబాలెంలోని డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. రోటరీ జిల్లా 3150 గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే 260 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఉచితంగా బస్‌పాస్‌లు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. డాన్‌బాస్కో హెచ్ఎం ఫాతిమా మాట్లాడుతూ గతంలో తమ ఉన్నత పాఠశాల కేవలం వికలాంగ బాలబాలికల కోసమే స్థాపించడం జరిగిందని, అధిక శాతం పోలియోతో బాధపడే పిల్లలే ఉండేవారన్నారు. నాలుగు దశాబ్దాలుగా రోటరీ వారు నిర్వహించిన పోలియో నిర్మూలన కార్యక్రమాల వల్ల నేడు ఒక్క పోలియో విద్యార్థి కూడా లేరన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్ మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలోని మరి కొందరు విద్యార్థులకు కూడా ఏపీఎస్ఆర్టీసీ వారి బస్‌పాస్‌లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ వంశీకృష్ణ, పూర్వ అధ్యక్షులు డాక్టర్ అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు అందె మురళీమోహనరావు, కాపరౌతు సుందరయ్య, పారేపల్లి నిరంజన్ గుప్తా, మాజేటి వంశీకృష్ణ, బట్టు వెంకటేశ్వరరావు, తుళ్లిమిల్లి రామకృష్ణ, కొతరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సమన్వయకర్త సురేష్ కుమార్
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్

తాడికొండ: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రజారోగ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, మరుగున పడిన ప్రకృతి వ్యవసాయాన్ని వెలుగులోకి తీసుకొచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం వ్యవసాయంలో పురుగుమందులు వాడకం పెరగడంతో పంట దిగుబడులు పెరిగినా ప్రజలకు రోగాలు తప్పడం లేదన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రెల్లి కార్పొరేషన్ చైర్మన్‌లు కొమ్మూరి కనకారావు, మధుసూదనరావులు మాట్లాడుతూ మిర్చి పంటలో అధిక పురుగుమందుల వాడకం పెరిగిన కారణంగా కారం ద్వారా హానికారక రోగాలు ప్రజల వద్దకు దరిచేరుతున్నాయన్నారు. ప్రజల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నూరుశాతం రాయితీపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అందజేసి ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం అతిథులతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు ఎస్సీ రైతులకు విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తేళ్ల ప్రేమకుమారి, ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ఎ రాజకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, నిడుముక్కల, కంతేరు సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్‌బాబు, ఎంపీడీవో అత్తోట దీప్తి తదితరులు పాల్గొన్నారు.

12న కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకలు

పాత గుంటూరు: కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఈనెల 12, 13 తేదీలలో నిర్వహించనున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల నిర్వహించనున్న వేడుకల్లో చిత్రకళపై వర్క్‌షాపు, ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రదర్శనలు ఇచ్చేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి 50 మంది ప్రముఖ చిత్ర కళాకారులను కళాపీఠం ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 12న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సభలో ముఖ్య అతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గా ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

అంతర పంటలసాగు తప్పనిసరి

ఫిరంగిపురం: ప్రధాన పంటలతోపాటు అంతర పంటలసాగు తప్పనిసరిగా వేయాలని రాష్ట్ర రైతు సాధికారత సంస్థ జిల్లా డీపీఎం రాజకుమారి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆచార్య వెంకట్రామయ్య ప్రకృతి యోగాసంజీవని ఆరోగ్యసదనం వారి ఆశ్రమంలో ఏటీఎం మోడల్స్ బెడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిని మంగళవారం డీపీఎం రాజకుమారి, ఎస్ఆర్పీ వెంకట్రావునాయుడులు పరిశీలించారు. వెంకట్రావు నాయుడు మాట్లాడుతూ రైతులందరూ తక్కువ పెట్టుబడితో రసాయనాలు వాడకుండా ఏటీఎం మోడల్స్‌లో భాగంగా ప్రధాన పంటతో పాటు అంతర పంటలసాగు వేసుకోవాలని సూచించారు. అంతరపంటలుగా ముల్లంగి, బీట్రూట్, కేరట్, గోరు చిక్కుడు, చిక్కుడు, బీన్స్, అలచందలు, మొక్కజొన్న, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మెంటార్ భార్గవ్, ఇ.వెంకటేశ్వర్లు, సీహెచ్ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



జననం 15-08-1934
మరణం 30-07-2023
కీ॥శే॥ శ్రీ మిట్టపల్లి పాండురంగరావు గారు
గుంటూరు
మంచితనానికి మారుపేరుగా నిలిచి, అనుక్షణం కుటుంబ శ్రేయస్సు కోసం పాటుబడిన మీరు మా నుండి దూరమైనా
మీ మధుర స్మృతులు సదా మా మదిలో పదిలం, దైవ సన్నిధికి చేరిన
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ..
కుమారులు - కోడళ్ళు
మిట్టపల్లి హరిబాబు - ప్రమీలారాణి
మిట్టపల్లి రమేష్‌బాబు - సువర్ణ
మిట్టపల్లి రాజేంద్రబాబు - రత్నకుమారి
మిట్టపల్లి ఆదినారాయణ గుప్తా - మణిలాల్
కుమార్తె - అల్లుడు
జయశ్రీ - కొణిజేటి శ్రీనివాసరావు
మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు
మిట్టపల్లి ఆగ్రో గ్రూప్ ఆఫ్ కంపెనీస్
గుంటూరు
పెదకర్మ : ది.09-08-2023 బుధవారం గుంటూరు అరండల్‌పేటలోని మా స్వగృహము నందు జరుగును.
కావున తెలియజేయడమైనది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com